# ఏటీఎంల భద్రత గాలికి !

- చాలా ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డుల కరువు
- భద్రతతో సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న బ్యాంకులు
- ఏదైనా చిన్న సమస్య వచ్చినా వినియోగదారుల అవస్థలు

» హిందూపురం పట్టణంలోని ఓ ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకునేందుకు వెళ్లిన ఓ మహిళ నగదు డ్రా చేసుకున్న తరువాత ఏటీఎం కార్డు మిషన్ నుంచి రాకపోవడంతో నానా అవస్థలు పడింది. అక్కడ ఎవరూ రక్షణగా లేకపోవడంతో చివరకు సమీపంలో ఉన్న దుకాణదారుడిని బతిమాలి అక్కడకు తీసుకొచ్చి ఎలాగో కార్డు తీసుకుంది. సెక్యూరిటీ సిబ్బంది ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని మహిళ వాపోయింది.



సెక్యూరిటీ లేకుండా ఉన్న హిందూపురం నానెప్పనగర్‌లోని ఏటీఎం

హిందూపురం అర్బన్: బ్యాంకు ఖాతాదారుల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన ఏటీఎంల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడపడితే అక్కడ అందుబాటులో ఉన్న ఏటీఎంల నిర్వహణతో పాటు భద్రతను బ్యాంకులు గాలికి వదిలేశాయి. ఏటీఎం కేంద్రాలకు సరైన రక్షణ లేక పోవడం, అక్కడ ఏదైనా సమస్య తలెత్తితే సమాధానాలు చెప్పేవారు లేక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కేటుగాళ్లు వినియోగదారులను ఏమార్చి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి.

**'పురం'లో 52 ఏటీఎంలు**

జిల్లా వ్యాప్తంగా 190 వరకూ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకులకు సంబంధించిన 392 ఏటీఎం కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్క హిందూపురంలోనే 52 ఏటీఎంలు ఉన్నాయి. వీటిలో నగదు నింపడం నుంచి నిర్వహణ బాధ్యతలను మొత్తం ప్రైవేటు ఏజెన్సీలే చూస్తున్నాయి. దీంతో బ్యాంకర్లు తమకు సంబంధం లేదనే రీతిలో ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే భద్రత దృష్ట్యా ఏటీఎంల వద్ద సెక్యూరిటీని ఉంచిన బ్యాంకులను చేతి వేళ్లపై లెక్కించవచ్చు. మిగతా చోట్ల సెక్యూరిటీ సిబ్బంది ఉంటే ఒట్టు. ఇక బ్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన ఏటీఎంలను రాత్రివేళ మూసి వేస్తున్నారు. మళ్లీ బ్యాంక్ తీసినప్పుడు మాత్రం తెరిచి ఉంచుతుండటంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

**ఏటీఎం సెంటర్లే షెల్టర్లు**

హిందూపురం పట్టణ శివారు ప్రాంతాల్లోని ఏటీఎం కేంద్రాలు వర్షానికి, చలికి తలదాచుకొనేందుకు షెల్టర్లుగా మారాయి. కొన్ని ఏటీఎంలు కుక్కలకు కేంద్రాలుగా మారాయి. ఏటీఎంలలో నగదు పెట్టడం తప్ప భద్రతా విషయాలను ప్రైవేట్ ఏజెన్సీలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కుక్కలు ఏటీఎం కేంద్రాల్లో ఉంటుండటంతో వాటిల్లోకి వెళ్లాలంటేనే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

**తగ్గుతున్న ఆదరణ**

గుగుల్‌పే, ఫోన్ పే, యూపీఐలు వచ్చిన తరువాత ఏటీఎంల ఆదరణ తగ్గుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ఖాతాల్లో ఉన్న నగదు క్షణాల్లో ఇతరులకు పంపడం, ఇతరుల నుంచి తీసుకోవడం చేస్తున్నారు. దీంతో ఏటీఎంలకు వెళ్లే వారి సంఖ్య గతంతో చూస్తే తగ్గుతోంది.

**సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి**



హిందూపురం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నెట్ బీట్లకు వెళ్లే పోలీసులకు తగిన సూచనలు ఇస్తున్నాం. రాత్రి వేళ గస్తీ తిరిగే పోలీసులు ఏటీఎంలు, పరిసరాల్లో నిఘా ఉంచేలా చూస్తున్నాం. ప్రధానంగా సంబంధిత బ్యాంకులు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవడం మంచిది. ఇదే విషయం బ్యాంకర్లకు ఎన్నోసార్లు చెప్పాం.

– శ్రీనివాసులు, సీఐ, హిందూపురం

## సజావుగా మండల సర్వసభ్య సమావేశం


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల: గ్రామాల్లో తాగునీటి కొరత రానివ్వకుండా అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవిత తదితరులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలానికి రెగ్యులర్ విద్యుత్‌శాఖ ఏఈని నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేశారని, అయితే పీహెచ్‌సీని గుడిబండ మండల కేంద్రానికి తరలించారన్నారు. దీంతో చిన్నారులకు వేసే వ్యాక్సినేషన్‌తో పాటు ఇతరాత్ర ఔషధాలు తెచ్చుకోవాలంటే గుడిబండ, మోరుబాగల్‌తో పాటు మడకశిర మండలం గుండుమలలోని పీహెచ్‌సీకి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇది వరకే మండలంలోని రత్నగిరి పంచాయతీ కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణానికి గత ప్రభుత్వం స్థలాన్ని కూడా కేటాయించిదన్నారు. రత్నగిరిలోనే కొత్తగా పీహెచ్‌సీని నిర్మాణం చేపట్టే వరకూ తాత్కాలికంగా పీహెచ్‌సీని ప్రారంభించి ఇబ్బందులు పడకుండా చూడాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, తహసీల్దార్ భద్రుజమ, సెరికల్చర్ ఏడీ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికి దారి చూపండయ్యా..


నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లిలో ఓ స్థలం విషయంలో తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు కుటుంబ సభ్యులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సర్వేనంబర్ 460లో తమ ఇంటికి దారి లేకుండా సమస్య సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వలీబాషా అక్కడికి చేరుకొని వారికి సర్ది చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే తహసీల్దార్ వద్ద ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం బాధితులు తహసీల్దార్ వద్దకు చేరుకున్నారు. రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ వారికి హామీ ఇచ్చారు.

## వైద్యుల సేవలు వెలకట్టలేనివి


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: ప్రభుత్వ ఆస్పత్రిలో అవిశ్రాంతంగా రోగులకు సేవలందిస్తున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివని స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి అభినందించారు. వైద్యుల దినోత్సవాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పాలనాధికారి డా శ్రీనివాసబాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో 13 వైద్యులు ఉండాల్సి ఉందని, అయితే కేవలం 6 మంది వైద్యులు మాత్రమే సేవలందిస్తుండటం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయాలన్నారు. వైద్యులు డా నందన్, కిరణ్, పూజా, రమేశ్, శ్రీనివాసబాబులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యలోకేశ్ పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోండి


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హిందూపురం: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మకు చెప్పుల దండవేసి అవమానించిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్లమెంట్‌లో ఎంపీ రాహుల్ గాంధీ... ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీజేపీ, ఆర్‌ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తే హిందూ సమాజానికి అన్వయించడం సరికాదన్నారు. మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నాయకులకు దేశప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్లో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌కిరణ్, యూనస్, కలీం, హనుమంతరాయుడు, అంజి, ఫిరోజ్, జియా, షఫీ, సలాం తదితరులు పాల్గొన్నారు.

## బంద్ జయప్రదం చేయండి

మడకశిర: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా గురువారం నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేంద్ర కోరారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలను బంద్ చేయాలన్నారు.

హిందూపురం టౌన్: దేశవ్యాప్త విద్యాసంస్థల సమ్మెను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ కళాశాల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

రొద్దం: దేశ వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్ పిలుపునిచ్చారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలను రాష్ట్ర బీసీ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదులు పరిశీలించడంతో పాటు తాగునీటి సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సీఆర్టీలు, సిబ్బందిని హెచ్చరించారు.

## ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

గోరంట్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి వేధింపులు తాళలేక ఈ ఏడాది మేలో గోరంట్ల పట్టణంలో ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న శబరీ అనే మహిళ ఆత్మహత్యకు యత్నించింది. అయితే గౌతమిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఇందులో భాగంగానే ఆశావర్కర్లతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ అక్బల్‌బాషాకు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. శబరీకి న్యాయం జరిగే వరకూ తాము విధులను బహిష్కరిస్తున్నట్లు ఆశావర్కర్లు పేర్కొన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం: హిందూపురం సెబ్‌స్టేషన్ పరిధిలోని జీమాకులపల్లి క్రాస్ వద్ద అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. హిందూపురం రహదారిలో తనిఖీలు చేస్తుండగా పట్టణానికి చెందిన ఇంతియాజ్ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 6 బాక్సుల్లో 576 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మద్యం ప్యాకెట్లు, స్కూటర్ సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బంది చంద్రశేఖర్, ప్రకాష్, వెంకటేశం, ఆంజనేయులు, బాబు, మంజువాణి తదతరులు పాల్గొన్నారు.

### వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ గోపీ

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఈ-చలానాలు సక్రమంగా కట్టారా? లేదా అనే వివరాలపై ఎస్ఐ ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

### విద్యార్థులకు బూట్లు, సాక్సులు సరఫరా

అగళి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, సాక్సులు ప్రత్యేక వాహనాల్లో సరఫరా చేసినట్లు ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. 45 పాఠశాలల్లో చదువుతున్న 3,085 మంది విద్యార్థుల కోసం వాటిని పంపామన్నారు.

### రికార్డులు పక్కాగా నిర్వహించాలి

అమరాపురం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రికార్డులను పక్కగా నిర్వహించాలని ఎంఈఓ – 1 రాఘవయ్య, ఎంఈఓ – 2 వెంకటరమణనాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించండి

పావగడ: తాలూకాలోని పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి పొందిన చారిత్రాత్మక నిడుగల్ దుర్గం ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక నిడుగల్ క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ధర్మకర్త శ్యానా ప్రసన్నమూర్తి ఏపీఎస్ఆర్టీసీ పెనుగొండ విభాగం డిపో అధికారులను కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిడుగల్ అత్యంత సుందరమైన ప్రాంతమని, అనేక దేవాలయాలు, స్మారకాలు, శిలా ఫలకాలు, శిల్పాలు ఉన్నాయన్నారు. ఇక్కడి వచ్చేందుకు చుట్టు పక్కల ఆంధ్ర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు బస్సుల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెనుకొండ ఆర్టీసీ డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

## క్లుప్తంగా

### మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


టైలరింగ్ సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో కియా పరిశ్రమ సహకారంతో 75 మంది మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు, సామగ్రి పంపిణీ చేశారు. గుట్టూరు, అమ్మవారిపల్లి, ఎర్రమంచి గ్రామాలకు చెందిన మహిళలకు మూడు నెలల పాటు కుట్టులో శిక్షణ ఇచ్చారు. నెలకు రూ.21 వేల స్టైఫండ్ కూడా ఇచ్చారు. ఇందులో భాగంగానే కియా పరిశ్రమలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా కియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కియా సంస్థ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే కుట్టులో శిక్షణ ఇచ్చామన్నారు. కియా పరిశ్రమ ఇప్పటి వరకు ఎన్నో సామాజిక కార్యక్రమాలను కియా పరిశ్రమ (సీఎస్ఆర్) ద్వారా చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కియా పరిశ్రమ సహకారం ఉంటుందన్నారు.

### పశువులకు వ్యాక్సిన్


ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా వైరస్ ప్రబలిన గ్రామాల్లో ఆవులు, దూడలకు బుధవారం పశుసంవర్ధకశాఖ అధికారులు వ్యాక్సిన్ వేశారు. జేడీ శుభదాస్ కొలిమిపల్లి గ్రామాన్ని సందర్శించి పాడి రైతులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైరస్ నివారణకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దాదాపు 350 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు పశు వైద్యుడు బాలాజీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ ఏడీ రామచంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

### మృతదేహం వెలికితీత

సోమందేపల్లి: మండలంలోని మంచేపల్లి గ్రామంలో మంగళవారం బావిలో పడి మృతిచెందిన ప్రేమ్ బహదూర్ (40) మృతదేహాన్ని బుధవారం వెలికి తీసినట్లు పోలీసులు తెలిపారు. నేపాల్ దేశానికి చెందిన మృతుడు ప్రేమ్ బహదూర్ మరుకుంటపల్లి గ్రామం వద్ద రాజశేఖర్ ఎస్టేట్‌లో కూలి పనులు చేసేవాడు. అయితే ఈతకు వెళ్లి బావిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని బావి నుంచి వెలికితీయడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

### చిరుధాన్యాలను విరివిగా పండించాలి

గుడిబండ: స్థానిక వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య కార్యాలయంలో 60 మంది మహిళా కిసాన్ రైతులకు 60 ఎకరాల్లో సాగు చేయడానికి 1.50 కేజీల 98 ప్యాకెట్ల సజ్జలను డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి నరసయ్య రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సజ్జలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు చిరుధాన్యాలను విరివిగా పండించి లాభాల బాట పట్టాలన్నారు.

### వ్యక్తికి తీవ్రగాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చత్రం గ్రామానికి చెందిన గోవిందప్పకు తీవ్ర గాయాలయ్యాయి. బుళ్లసముద్రం నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు గోవిందప్పను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి రూ.16 లక్షల విరాళం


విరాళాల సేకరణ రసీదులు చూపుతున్న కమిటీ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని ఐదులాంతర్ల సర్కిల్ గాంధీ చౌక్ వద్ద నిర్మించనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాల రూపంలో నగదులు అందజేశారు. ఆలయ శాశ్వత ట్రస్టీలు రూ.21,116 చొప్పున కమిటీ సభ్యులకు విరాళాల రూపంలో మొత్తం రూ.16 లక్షలు జమ చేశారు. ఆలయ కమిటీ సభ్యులుగా గౌరవాధ్యక్షుడు జేతు వెంకటస్వామి, అధ్యక్షుడిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా అంబికా రఘునాథ్, కార్యదర్శి నిమ్మకాయల రాము, డైరెక్టర్లు చంద్రమోహన్‌యాదవ్, నెట్టప్ప, ఆమర్నాథ్, సూర్యనారాయణలును ఎన్నుకున్నారు. ఆలయ నిర్మాణం కోసం కమిటీ సభ్యులు రూ.16 లక్షలను జమ చేశారు. దాదాపు రూ.6 కోట్ల అంచన వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టడానికి అంచనలు వేసినట్లు తెలిపారు. దాతలు, పుర ప్రముఖులు విరాళాలు అందించాలని కోరారు.

### ఉపాధి సిబ్బంది నుంచి రూ.70 వేలు రికవరీ


ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

లేపాక్షి: మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ప్రజావేదిక గ్రామసభలో అధికారులు రూ. 70 వేలు రికవరీ చేశారు. మండల వ్యాప్తంగా గత నెల 27వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకూ సామాజిక తనిఖీ బృందం వివిధ పనులను తనిఖీ చేసింది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన పనుల తనిఖీని పూర్తి చేశారు. ప్రజావేదికలో ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 800 పైగా జరిగిన పనులకు గాను రూ. 11 కోట్లు నిధులు వెచ్చించినట్లు చెప్పారు. అయితే వివిధ పనుల్లో రూ.70 వేలు అవినీతి జరిగిందని, ఉపాధి సిబ్బంది నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ వాసుదేవగుప్తాతో పాటు ఎస్ఆర్పీ, డీఆర్పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### 6న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

రొళ్ల: మండల కేంద్రంలో ఈనెల 6న ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### తెగుళ్లపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

పెనుకొండ: ఖరీఫ్ పంట సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, డీఆర్సీ ఏఓ అబ్దుల్‌వలి వరి, వేరుశనగ సాగు విధానం, కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి సాగు చేసిన 15-18 రోజుల అనంతరం కలుపు మందు పిచికారీ చేయాలన్నారు. వరి పంటను ఆశించే సుడిదోమ నివారణకు ఒక ఎకరాకు పెక్సిలాన్ 110 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో ఎల్ఆర్‌జీ 52 రకాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. డ్రోన్‌ద్వారా పురుగుల మందును వినియోగిస్తే ఖర్చు తగ్గటమే కాకుండా నీరు ఆదా అవుతుందన్నారు. వేరుశనగలో అంతరపంటగా ఆముదం 5:1 నిష్పత్తిలో వేస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ స్వయంప్రభ, ఏఓ చందన, ఏఈఓలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### శుభకార్యం


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని కంటిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభయ్య కుమార్తె నేత్ర – చేతన్ వివాహం బుధవారం పావగడలో జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, జెడ్పీటీసీ భూతరాజు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ్, తాలుకా బీసీ సెల్ నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు తదితరులు పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం సభ్యుడు భాస్కర్ వారిని ఘనంగా సన్మానించారు.

### వ్యక్తిపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరు గ్రామానికి చెందిన ఉప్పర నరసింహమూర్తిపై అదే గ్రామానికి చెందిన ప్రభు దాడి చేయడంతో ప్రభుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. ప్రభు గ్రామంలో పేకాట స్థావరాలు నడుపుతుంటాడని చెప్పారు. అయితే పేకాటపై తమకు నరసింహమూర్తి సమాచారం ఇచ్చారన్న కోపంతో అతనిపై దాడికి పాల్పడినట్లు వివరించారు. గ్రామాల్లో ఘర్షణలు, గొడవలు పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.